
# ఆతిథ్యం



సన్నపాటి తేమగాలి ఒంటిని తాకగానే ఎంతో హాయి అనిపించింది. కానీ అంతలోనే చురుక్కుమనిపించే సూర్యకిరణాల తాకిడికి ఒళ్ళంతా కంపరమెత్తింది రోడ్డు మీద నడుస్తున్న రాఘవులకి. అసలే జరిగిన సంఘటనకి ఒళ్ళంతా ప్రకంపనలు పుడుతుంటే క్షణక్షణం మారిపోతున్న వాతావరణాన్ని ఎంతమాత్రం భరించలేక విసుగ్గా ఇంటిముఖం పట్టాడు.

"వీళ్లు నావాళ్లు- మనవాళ్లు అని ఆశపడటం, అభిమానించడం అత్యాశేనంటావా?" అప్పుడే ఇంటికొచ్చి సోఫామీద చతికిలపడుతూ ఎదురుగా వున్న భార్య సంధ్యతో అన్నాడు రాఘవులు. గుండె పొరల్ని చురకత్తితో సన్నగా కోస్తున్నప్పటి బాధను, బలవంతంగా భరిస్తున్నట్లు ఉన్నాడతను.

"ఇప్పుడే కదండీ వీధిలోకెళ్లారు! ఇంతలో ఏమైంది మీకు? వెళ్లిన పని అయినట్లేనా"? అంది సంధ్య భర్తలోని ఉదాసీన వైఖరికి కారణాలు వెతుకుతూ...

" లేదు, ఎక్కడికీ వెళ్లాలనిపించలేదు. ఈ సంగతి విన్నావా? దివాకర్ వూళ్లో కొచ్చాడట" ఆశ్చర్యపడుతూ అన్నాడతను.

"అదేంటండీ....మనింటికి రాకుండా ఎక్కడికెళ్లాడు? మీరంటోంది మన దివాకర్ గురించేనా?" తిరిగి ప్రశ్నించింది సంధ్య నమ్మలేనట్లు.

" రైల్వే స్టేషన్లో మా ఫ్రెండ్‌కి దివాకర్ నిన్న కలిశాడట. వాళ్లత్తగారికి సుస్తీ చేసిందని తెలిసి చూడ్డానికొచ్చి అట్నించటే వెళ్లి పోతున్నానని చెప్పాడట. ఇదీ మనవాడి బంధుత్వం" రాఘవులు ఎంతో మనస్తాపానికి గురైన వాడిలా అన్నాడు సంధ్యతో.

" ఆహా... అలాగా! యిక్కడ పక్కనే వున్న సంగతి తెలియనిది...ఎక్కడో హైదరాబాద్‌లో ఉన్న దివాకర్‌కి తెలిసి వెంటనే పరిగెత్తుకొచ్చాడంటే నమ్మబుద్ధి కావడంలేదండీ" అంది సంధ్య భర్త మాటలతో ఏకీభవిస్తూ.

"ఓసి వెర్రిమొహమా! వాడు అత్తగార్ని చూడ్డానికొచ్చాడని కాదే నా బాధ. ఒక్క నిముషమైనా మనింటివైపు చూడకుండా, అంత గుంభనంగా వెళ్ళిపోవడమే విడ్డూరమనిపిస్తోంది. పొద్దస్తమానం 'పిన్నీ పిన్నీ' అంటూ నీ వెనకాలే తిరిగే వాడికి యింత నిర్లక్ష్యమేమిటా అని" అంటూ రాఘవులు దివాకర్ ప్రవర్తనపై విరుచుకుపడ్డాడు.

" పోన్లేద్దురూ... వాడి గురించి తెలిసిందే కదా, 'మాటలు పాటలు మా ఇంట, మాపటి భోజనం మీ ఇంట అన్నాడట. వెనుకటికెవడో', అనే బాపతు మన దివాకర్‌ది. అది తెలిసికూడా, వాడి గురించి మీరెందుకిలా వర్రీ అయిపోతారు?" అంది సంధ్య కాస్తంత ఓదార్పు పాళ్ళు జోడించి.

"వాడితో మన బంధం ఎంతటిదో మా ఫ్రెండ్‌కి తెలుసు. వాడేమన్నాడో తెలుసా? 'దివాకర్ ఈ వూరొచ్చాడన్న సంగతి తెలియదా? మీ ఇంటికి రాకుండా, మిమ్మల్ని కలవకుండా వెళ్ళిపోయాడా? ఏమైనా మనస్పర్థలు పుట్టుకొచ్చాయా? అంటూ గుచ్చిగుచ్చి మాట్లాడాడు. అనుమానంగా ఓ చూపు చూసేసరికి నా మనసు గిలగిల కొట్టుకుందంటే నమ్ము.' అన్నాడు రాఘవులు భృకుటి ముడిచి అసహసంగా అటూ ఇటూ ఒకమారు కదులుతూ.

సంధ్య కూడా భర్త మనసుని అర్థం చేసుకున్నదానిలా "లేదండీ ..వాడి బుద్ధే అలాంటిది

గుమ్మం దాటగానే చిటికిన వేలు విరిచేసుకున్నట్లు మనసు- మమకారం లేనివాడిలా మరిచిపోయి వెళ్లిపోతాడు. వాడి తత్వం తెలిసి కూడా మీరంత బాధపడుతున్నారంటే మీరెంతగా వాడిని అభిమానిస్తున్నారో తెలుస్తోంది. వాడెలాగూ హైదరాబాద్ రమ్మంటాడు. మనం వెళ్లొస్తాం సరేనా? ఇంతటితో ఈ విషయం వదిలేయండి' అంది సంధ్య భర్త మనసు గెలిచే ప్రయత్నం చేస్తూ, మరింత సంయమనం పాటిస్తూ.

“అవున్లే. నాకు చెపుతున్నావ్ నీతికబుర్లు వాళ్ల అమ్మానాన్నలకైనా బుద్ధివుండక్కర్లేదా ? పెద్దలంటే కాస్తంత గౌరవం. బంధుత్వాల గురించి చెప్పనక్కర్లేదా అంటాను.” అన్నాడు రాఘువులు. అతను ఒకింతట రాజీపడటంలేదు.

పాతికేళ్ల క్రితం దివాకర్ తల్లిదండ్రులు ఉద్యోగరీత్యా దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు దివాకర్‌ని సొంతకొడుకులా చేరదేసి స్కూళ్లో చేర్పించారు. సెలవులకి అతను తల్లిదండ్రుల దగ్గరకెళ్లేవాడు. మళ్లీ తిరిగి వచ్చేవాడు. తనిదివరకు ఎవరితో ఎక్కడ వుండేవాడో అసలు గుర్తేలేదన్నట్లు ప్రవర్తించేవాడు. చదువయ్యేదాకా రాఘువుల ఇంట్లోనే వున్నా, మరింక వచ్చే పనిలేదన్న అభిప్రాయంతో ముఖావంగా వుండి పైచదువులకి వెళ్లిపోయాడు దివాకర్. నాలుగైదు సంవత్సరాలు గడిచిపోయాయి. దివాకర్ దగ్గర్నుండి ఎటువంటి మాట, పలకరింపు లేకపోయేసరికి అతడి విషయం మరిచిపోయినట్లు ఉండిపోయారు. లేనిపోని అభిమానాలు ఊరికే పెంచేసుకుని, అవి కాస్తంత దూరమైపోయేసరికి ఏదో జరగరానిది జరిగినట్లు ఏడవటం ఒంటికి అంత మంచిది కాదనుకున్నారు ఇద్దరూ. ఒక రోజు రాఘువులు అన్నయ్య, వదినలు ఫోన్ చేసి దివాకర్‌కి వివాహం చేయాలని నిశ్చయించుకున్నామని, ఏమన్నా మంచి సంబంధం వుంటే చూడండని అన్నారు. ముందు కొద్దిగా తటపాయించినా, సంధ్య బలవంతంమీద కాదనలేకపోయాడు రాఘువులు.

దివాకర్ ఒకరోజు రాఘువులు ఇంటికి వచ్చాడు. గుమ్మంలో అడుగుపెడుతూనే “చిన్నాన్నగారూ” అంటూ ఎంతో గొప్ప ఆదర్శ పురుషుడిలా కాళ్లమీద పడ్డాడు. ఆ తరువాత 'పిన్నీ' అంటూ సంధ్య కాళ్ళు చుట్టేశాడు. దానికి ఆమె పొంగిపోతూ ‘ చూశారా... దివాకర్ ఎంతగా ఎదిగిపోయాడో? పెద్దలంటే అభిమానం, గౌరవం ఉట్టిపడుతోంది. పిల్లలంటే యిలా వుండాలి' అంది.

రాఘువులు మాత్రం తన అంచనాలు యిలా తారుమారు అయ్యాయేమిటని తడబాటు చెందాడు. ‘ ఇది నిజమా, కలనా, ఎవరన్నా నేర్పిస్తే నేర్చుకున్న సంస్కారమా? ఏదీ నమ్మశక్యంగా లేదనుకున్నాడు.

రాఘవులు స్నేహితుడొకరు తన కూతురికి ఏదన్నా మంచి సంబంధం చూడమన్నాడు. అప్పట్లో అంతా పట్టించుకోకపోయినా...' ఆ అమ్మాయికి సరైన ఈడూజోడూ దివాకర్. అతనికి ఇచ్చి చేస్తే బాగుంటుందని అనుకున్నాడు రాఘవుల. రెండు కుటుంబాల్నీ కలిశాడు.

దివాకర్‌కి అమ్మాయి నచ్చింది. అంతే అనుకున్నదే తరవాయి పెళ్లి కూడా దర్జాగా, దాబుగా జరిగింది.

అతను హైదరాబాద్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని కొత్త కాపురం పెట్టాడు. ఆరునెలలు గడిచాయి. మరో ఇల్లు మారాడు.

ఇప్పుడు దివాకర్ వూళ్లోకొచ్చి అత్తగార్ని, మామగార్ని చూసుకొని వెళ్లిపోడమే. రాఘవులకి మింగుడుపడలేదు. లోలోపన మధనపడినా...దివాకర్ నిర్లక్ష్య ధోరణి గురించి మరో మిత్రుడి నోటి వెంట వినడం తన తలకొట్టేసినంత పని అనుకున్నాడు.

'దివాకర్ ఓ ఇంటివాడైపోయాడు. అత్తగారింటిపై వాలితే అచ్చటా ముచ్చట తీరుతాయి. మధ్యన మనతో పనేంటి?' అని సరిపెట్టుకున్నాడు రాఘవులు అప్పుడప్పుడూ సంధ్య ఓదార్పుమాటలతో ఎటూ తేల్చుకోలేక మిన్నకుండిపోయేవాడు.

ఒకమారు రాఘవులు ఆఫీసు పనిమీద ట్రయినింగ్ కోసం ముంబాయి వెళ్లాడు. తిరుగు ప్రయాణానికి ముందు వాన మొదలై బీభత్సంగా మారింది. రోడ్లన్నీ వరదనీటిలో నిండాయి. ఆ రోజు రోడ్డు దాటాలంటే రాఘవులకి కష్టమైపోయింది. వేసుకున్న ప్యాంటు తడవకుండా వుండాలని కిందికి వొంగి, ప్యాంట్‌ను మడత పెట్టుకోబోయాడు. షర్ట్ జేబులో వున్న మనీ పర్సు, ట్రయిన్ టికెట్, పెన్, పనికొచ్చే కొన్ని కాగితాలు అన్నీ నీళ్లలోకి జారిపడి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. రాఘవులు ఆతృతగా నీళ్లల్లో కొంతదూరం పరుగెత్తి వెళ్లినా ఫలితం లేకపోయింది. స్థాణువులా చూస్తూ వుండిపోవడం తప్పించి ఏమీ చేయలేకపోయాడు. ఆఫీసు కొలీగ్స్ సహాయంతో తిరుగు ప్రయాణం చేశాడు.

దారిలో రైలు సికింద్రాబాద్ స్టేషన్లో ఆగింది. దివాకర్ అక్కడే వుంటున్నాడని తెలిసి ఫోన్ చేయాలనుకున్నాడు రాఘవులు. ముందుగా సంధ్యకు ఫోన్ చేసి నెంబరు తెలుసుకొని దివాకర్‌కు కాల్ చేశాడు.

" దివాకర్! నేను, మీ చిన్నాన్నని..రాఘవుల్ని."

"ఆ! ఆ! చెప్పండి, నేనే ....ఏమిటి సంగతులు?" దివాకర్ గొంతు.

"ఇక్కడ్నించే. సికింద్రాబాద్ స్టేషన్ నుంచి మాట్లాడుతున్నాను".

"ఆహా ... అలాగా! ఎప్పుడొచ్చారు?

"హలో...దివాకర్! ఆఫీస్ పనిమీద ముంబాయి వెళ్లాను. అక్కడ నా పర్సుతో పాటు అన్నీ జేబులోనుంచి జారి నీళ్లలో కొట్టుకుపోయాయి.హలో...హలో వినపడుతోందా" అంటూ రాఘవులు ఎంతగా మాట్లాడాలని ప్రయత్నించినా అట్నుంచి వాయిస్ రాకపోవడంతో నిరాశపడి ఫోన్ పెట్టేశాడు. కదులుతున్న రైలెక్కి ఇంటికి చేరాడు. దివాకర్ తనతో ఫోన్‌లో మాట్లాడే తీరులోనే ఏదో లోపం, వెలితి, అసౌకర్యం ఉన్నట్లు తోచింది రాఘవులకి.

ఇంటికొచ్చాక భార్యతో తన ప్రయాణంలో జరిగిన అపశృతులన్నీ చెప్పాడు రాఘవులు. దివాకర్‌తో తను ఫోన్‌లో జరిపిన సంభాషణ కూడా చెపుతూ " ముందు చాలా చక్కగానే పలకరించాడు. ఆ తరువాత ఏమైందో! నా పర్సుపోయిందని చెప్పేసరికి...ఫోన్‌లో దివాకర్ మాటలు అసలు వినిపించలేదు. ఏదన్నా సహాయం అర్థించడానికి ఫోన్ చేశాననుకున్నాడేమో? ఏదిఏమైనా ఇందులో ఏదో లొసుగుంది" అన్నాడు చివరిగా దివాకర్ మనస్తత్వాన్ని అంచనా వేస్తున్నట్లు.

"వాడు అలాంటి వాడు కాదండీ, సిటీలో వుంటున్నాడు, ఏవో అర్జంటు పనులుంటాయి. మీరులేనిపోని అనుమానాలు, శంకలు పెట్టుకొని నిందించకండి. అయినా మీ కష్టాలకు వాడేం చేస్తాడు? ఎలాగూ మీ ఆఫీసు వాళ్లు ఆదుకుంటారు కదా" అంది సంధ్య. దివాకర్ మీద ఉన్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తూ. దివాకర్ ఎవరితో ఎలా ప్రవర్తించినా.. అతని తల్లిదండ్రులు పూర్తిగా అతని మాటనే విశ్వసిస్తారు. సమర్థిస్తారు. ఇక అత్తమామలకి అల్లుడి పద్ధతుల అంతగా నచ్చకపోయినా కూతురికోసం తప్పదు మరి. రాఘవులు మాట వరసకు దివాకర్‌ను ఏమైనా అన్నా వెంటనే ఖండించేస్తారు. "వాళ్లున్నది చిన్న ఇంట్లో ఇక్కడ అద్దెకుంటున్నారు. ఇద్దరూ ఉద్యోగాలకు పోయి పొద్దుపోయాక వస్తారు. కరెంట్ కోత, నీళ్ల కరువు, అరకొర సౌకర్యాలు పైగా నెలకో ఇల్లు మారుతున్నారు" అంటూ వారి బాధల్ని ఏకరవు పెట్టేసరికి రాఘవులకి మౌనమే శరణ్యమయ్యేది.

దివాకర్ అందరినీ దూరంచేసుకుంటూ ఎవరూ అక్కర్లేదనుకుంటూ ఎంతకాలం

సంసారం సాగిస్తాడు? ఏ కష్టమొచ్చినా ఇంట్లోవాళ్లు కాకుండా పరాయివాళ్లు ఆదుకుంటారా? జీవితాన్ని అర్థం చేసుకోవాలి అనుకున్నాడు రాఘవులు.

నిజంగా ఇలాంటి పరిస్థితే ఎదురైనట్లు ఏ సమస్య గురించి చెప్పకుండా దివాకర్... తన తల్లిదండ్రులిద్దర్నీ వచ్చిచూసి వెళ్లండని ఆహ్వానించాడు. ఆతిథ్యం స్వీకరించడానికి ఉన్నపాటున రమ్మంటే జరిగే పనికాదు. పరిస్థితులు అనుకూలించినప్పుడు పిలవకుండానే వస్తాం. ఇప్పుడు మాత్రం కుదరదని తేలిగ్గా కొట్టిపారేశాడు.

దివాకర్ ఆలోచనలో పడ్డాడు. భార్యతో మంతనాలాడాడు. అత్తమామల్ని వెంటనే రమ్మని కోరాడు. అత్తగారి వంట్లో నలతగా ఉన్నందువల్ల ఇప్పట్లో బయలుదేరే అవకాశం లేదని వాళ్లు తేల్చి చెప్పేశారు.

దివాకర్ దృష్టి పిన్ని, చిన్నాన్నలమీద పడింది. వీళ్లనెలాగైనా రప్పించాలనే ప్రయత్నంలో చిన్న ఎరవేశాడు. ' చిన్నాన్నగారూ! బాగున్నారా!' అని ఫోన్‌లో ప్రేమ ఒలకబోశాడు. 'పిన్ని ఎలా గుంది? హైదారాబాద్ రండి మిమ్మల్ని చూసి చాలాకాలమైంది. నెక్స్ట్ వీక్ ట్రయిన్ టికెట్స్ రిజర్వ్ చేసి పంపుతాను. ఇక్కడికి వచ్చి రెండు రోజులు రెస్ట్ తీసుకుని వెళుదురుగాని. మీకెన్ని అర్జంటు పనులున్నా అన్నీ కాన్సిల్ చేసుకుని బయలు దేరండి. మీరింకేం చెప్పినా వినదలచుకోలేదు ఉంటాను.' అంటూ హుకుం జారీ చేశాడు.

'ఎందుకింత అర్థాంతరంగా అందర్నీ పిలిచి ఆతిథ్యం ఇవ్వడం? ఎంతకీ అర్థం కావడంలేదు ఇద్దరికీ. అనుకున్నట్టే, ఆ వారంలో పోస్టులో టిక్కెట్లు అందాయి. ఇద్దరు బయలుదేరారు. రైల్వేస్టేషన్‌కొచ్చి దివాకర్ ఇద్దర్నీ రిసీవ్ చేసుకున్నాడు. ఇంటికి తీసుకెళ్లి అన్ని సపర్యలు చేశాడు. ప్రయాణ బడలికతో విశ్రమిద్దామనుకుంటే.. ఇరుగుపొరుగువారు, ఇల్లుగలవారు ఒక్కొక్కరు వచ్చి పలకరించసాగారు. కుటుంబ విషయాల్నీ కూపీలాగడం, విసుగుపుట్టినా మాట్లాడి వెళ్లడం ఎంతో చిరాకు కలిగించింది ఇద్దరికీ.

దివాకర్, శ్రీమతి ఇద్దరూ...ఎంతో శ్రద్ధగా అడుగులకు మడుగులొత్తినంత సేవ చేయసాగారు. రాఘవుల దంపతులకు ఎంతో తృప్తి కలిగింది. రెండ్రోజులు కాగానే సొంత ఇల్లు, సొంత వూరిపై మనసు లాగింది. దివాకర్ మరో రెండు రోజులు వుండమని కోరితే వుందామనుకున్నారు. కానీ తిరుగు ప్రయాణానికి టికెట్స్ రిజర్వేషన్ అయిపోయిందని తెలిసేసరికి మరి తప్పలేదు.

బయలుదేరే ముందు చవక బట్టలు తెచ్చి ఘనమైన పెట్టుపోతలా భావించి చేతిలోపెట్టి కాళ్ళకు దండం పెట్టిందా జంట. మనస్ఫూర్తిగా ఆశీర్వాదం పొందారు.

సూట్‌కేసు, చేతిసంచి పట్టుకున ఆటో ఎక్కడానికి గేటుదగ్గరకొచ్చారు రాఘవులు దంపతులు. అప్పటికే అక్కడ ఓ అయిదారుగురు మూగారు. అంతా మళ్ళీ వీడ్కోలు చెప్పడానికే వచ్చారనుకున్నారు రాఘవులు,సంధ్య. ప్రతీ ఒక్కరికీ పలకరించి చిరునవ్వుతో నమస్కరించారు.

ఆటో బయలుదేరుతుందనగా అంతా మూగి 'అయ్యగారూ! అబ్బాయికి,అమ్మాయికి వెనుకాముందు ఎవరూ లేరనుకున్నాం. మిమ్మల్ని చూస్తే కానీ ' ఇల్లు అద్దెకు ఇవ్వమన్నాం. ఇప్పుడు మాకెంతో నమ్మకం వచ్చింది. వాళ్ళకి ఏ ఇబ్బంది రాకుండా చూసుకుంటాం. మీరిక వెళ్ళిరండి.' అన్నారు ఒక్కొక్కరూ.

ఆటో శబ్దం చేసుకుంటూ బయలుదేరింది. రాఘవులు గతుక్కుమన్నాడు. వారంటున్న మాటలు కర్ణకఠోరంగా వినిపించాయి. ఒక్కసారి మెదడు మొద్దుబారినట్లయింది. 'ఇరుగుపొరుగువారి మనసుల్లో నమ్మకమనే ముద్ర వేయించుకోడానికి దివాకర్ చేశాడిదంతా. ఆతిథ్యం అనే ముసుగులో ఎంత దగా చేశాడు' అనుకుంటు రాఘవులు మనసు వికలమైపోయింది. సంధ్య మూగబోయిన హృదయంతో ఓ నిట్టూర్పు విడిచింది.

విపుల, జూలై, 2010